నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, మంగళవారం 28 జనవరి 2025 | RANGAREDDY




బడంగ్‌పేట మున్సిపల్ కార్యాలయంలోని డీఈ చాంబర్ ఎదుట ఆందోళన చేస్తున్న గాంధీనగర్ వాసులు, డీఈని ఘెరావ్ చేస్తున్న దృశ్యం

# కేసీఆర్ ఫ్రీగా ఇస్తే.. కాంగ్రెస్ పాలనలో బిల్లులు

**బడంగ్‌పేట గాంధీనగర్ పేదలకు**

**తాగునీటికి వేల రూపాయల్లో బిల్లులు**

**గృహజ్యోతికి అర్హులైనా..తప్పని కరెంటు చార్జీలు**

**బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ ముందు**

**కాలనీ వాసుల ఆందోళన**

బడంగ్‌పేట, జనవరి 27 : రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాలకు కేసీఆర్ ఉచితంగా తాగునీళ్లు అందిస్తే ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మాత్రం వారికి వేల రూపాయల్లో బిల్లులు వస్తున్నాయి. గృహజ్యోతికి అర్హులైనా.. నెలనెలా కరెంటు చార్జీలు మాత్రం చెల్లించాల్సి వస్తున్నది. ఇదేం అన్యాయమని అడిగితే సమస్యను పరిష్కరించే నాథుడు లేడు. దీంతో బడంగ్‌పేట మున్సిపాలిటీలోని గాంధీనగర్ వాసులు సోమవారం ఏకంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఇంజినీరింగ్ విభాగం డీఈని ఘెరావ్ చేశారు.

**ఇన్నాళ్లూ ఉచితంగా ఇచ్చి..**

బడంగ్‌పేట మున్సిపాలిటీలోని గాంధీనగర్‌లో 1400 పై చిలుకు కుటుంబాలు ఉన్నాయి. వీరందరూ గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. కానీ కేవలం 20 ఇండ్లకు మాత్రమే జీరో బిల్లులు ఇస్తున్నారు. మిగతావారికి మాత్రం వందల రూపాయల్లో బిల్లులు పంపుతున్నారు. కాలనీ వాసులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నప్పటికీ సమస్య అలాగే ఉండిపోయింది. కాలనీ ఏర్పడిన నాటి నుంచి.. బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో తాగునీళ్లను ఉచితంగానే సరఫరా చేశారని కానీ ఇప్పుడు కాంగ్రెస్ పాలనతో మాత్రం పాత బకాయిలన్నీ కలిపి ఇవ్వాలంటూ ఒక్కో ఇంటికి వేల రూపాయల్లో బిల్లులను పంపారని కాలనీ వాసులు మండిపడుతున్నారు. గాంధీనగర్‌లో 50 గజాలు, 30 గజాల ఇండ్లు ఉన్న వారికి 15వేలు,20 వేలు కట్టాలని నోటీసులు పంపిస్తే ఎలా కట్టగలమని వాపోయారు. అంతేకాకుండా తమ కాలనీకి మంజూరైన రోడ్డును ఉన్నట్టుండి రద్దు చేశారని అందుకు కారణమేమిటో చెప్పాలని పట్టుబట్టారు. మంచినీటి బిల్లు కట్టాల్సిన అవసరం లేదని బడంగ్‌పేట కమిషనర్ కూడా ఇటీవల హామీ ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బిల్లులు మాఫీ చేసే వరకూ పోరాటం చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో పేదల కాలనీల్లో ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారని కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వందలో పది మందికి జీరో బిల్లు ఇచ్చి అందరికీ అయిపోయిన్నట్లు చెప్పడం పై కాలనీ వాసులు మండి పడుతున్నారు.

**రూ.30 వేల నీటి బిల్లు వచ్చింది..**



గాంధీనగర్‌లో మేం ఉంటున్న 2 గదులకు రూ.30వేల బిల్లొచ్చింది. ఎట్ల గట్టాలె. పేదోళ్లం సారూ. బిల్లులు మాఫీ చేస్తమంటిరి. ఇప్పటివరకు చేయలేదు. నెలనెలా మాకైతే బిల్లులు పంపిస్తున్నరు. నీళ్లైతే సరిగ్గ వస్తలేవు కానీ బిల్లులు మాత్రం ఇచ్చిపోతున్నరు.

– నర్సమ్మ గాంధీ నగర్

**ముసలోళ్లం ఎట్ల గడ్తం**



ఎలక్షన్లప్పుడు ..నీళ్లు ఫ్రీగ ఇస్తమన్నరు. కరెంటు ఫ్రీ అన్నరు. ఎలక్షన్లు అయిపోయినాంక మా బాదను ఎవ్వరు పట్టించుకుంటలేరు. మేం ముసలోళ్లం. బిల్లులు కట్టనీకె వేల రూపాయలు ఏనుంచి పట్కరావాలె.

– లక్ష్మీ నర్సమ్మ

**పై అధికారులకు విన్నవిస్తా..**

గాంధీనగర్ తాగునీటి సమస్యను, బిల్లుల వ్యవహారాన్ని జలమండలికి నివేదిస్తా. ఈ సమస్యను పరిష్కరించాల్సింది వారే. ఇక గృహజ్యోతి–జీరో బిల్లుల వ్యవహారం కూడా నా పరిధిలో లేదు. గాంధీనగర్ వాసులు నా చాంబర్ ముందే ధర్నా చేశారు. విషయాల్నింటినీ కమిషనర్‌కు వివరిస్తా. కాలనీల్లో ఉన్న రోడ్లను పరిశీలిస్తా.

– డీఈ జ్యోతి

జిల్లా విద్యాశాఖలోకి వలసల జోరు పెరుగుతున్నది. నగర శివారు వరకు జిల్లా విస్తరించడంతో ఇతర జిల్లాల ఉపాధ్యాయులు వలస వచ్చేందుకు అనేక మార్గాలను ఎంచుకుంటున్నారు. 20 శాతం ఉండాల్సిన స్థానికేతరులు.. ప్రస్తుతం 50 శాతానికి పైగా మించిపోయారు. దీంతో జిల్లాలోని నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఉపాధ్యాయ సంఘాలు, నిరుద్యోగులు వాపోతున్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలకంటే రంగారెడ్డి జిల్లాలోని విద్యాశాఖలో విచిత్ర పరిస్థితి నెలకొన్నది. ఉద్యోగం కోసం ఇతర జిల్లాల నుంచి తీవ్ర పోటీ నెలకొన్నది. ఇతర జిల్లాల్లో ఖాళీలు భర్తీకాని పరిస్థితిలో రంగారెడ్డి జిల్లాలో ఉండాల్సిన దానికంటే, సుమారు 400ల మందికి పైగా ఉపాధ్యాయులు ఉండడం గమనార్హం. జిల్లాలోని హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని పాఠశాలల్లో కొన్ని చోట్ల విద్యార్థుల కంటే ఉపాధ్యాయులే అధికంగా ఉన్నారు. ఈ విచిత్ర పరిస్థితికి ఇతర జిల్లాల నుంచి వివిధ మార్గాల ద్వారా జిల్లాలోకి రావడమే కారణమని తెలుస్తున్నది. జిల్లావ్యాప్తంగా 1,350 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 8,529 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న పాఠశాలలకు సరిపడా కంటే అధికంగా ఉపాధ్యాయులు ఉన్నారు.

– రంగారెడ్డి, జనవరి 27 (నమస్తే తెలంగాణ)



స్థానిక

- జీవో 317, భార్యభర్తలు(స్పౌస్), మెడికల్ గ్రౌండ్‌ల ద్వారా జిల్లాలోకి పాగా..
- 20 శాతం ఉండాల్సింది.. 50 శాతానికి పైగా దాటింది
- స్థానిక నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని ఉపాధ్యాయ సంఘాల ఆందోళన

# నిరుద్యోగులకు నిండు సున్నే..!

## జిల్లా విద్యాశాఖలోకి ఇతర జిల్లాల నుంచి ఉపాధ్యాయుల వలసల జోరు..

**స్థానికతను అడ్డం పెట్టుకుని..**

మహబూబ్‌నగర్ జిల్లాలోని పది మండలాలను రంగారెడ్డి జిల్లాలో కలపడం వల్ల ఆ జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు 317 జీవోను అడ్డం పెట్టుకుని సుమారు 400 నుంచి 600ల వరకు రంగారెడ్డిజిల్లాలోకి ప్రవేశించారు. జిల్లాలో విలీనమైన షాద్‌నగర్ నియోజకవర్గంలోని మండలాలు, ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల మండలాలు రంగారెడ్డి జిల్లాలో కలిశాయి. దీంతో ఆ జిల్లా ఉపాధ్యాయులకు కూడా జిల్లాలో స్థానికత లభించింది. దీని ఆధారంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి అనేక మంది జూనియర్లను ముందుగా జిల్లాకు కేటాయించారు. దీంతో జూనియర్లను ఎలా కేటాయిస్తారంటూ.. తమను కేటాయించాలని సీనియర్లు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ద్వారా సీనియర్లు కూడా జిల్లాలోకి పెద్ద ఎత్తున ప్రవేశించారు. ఆ సమయంలో జూనియర్లను వెనక్కి పంపించకపోవడం వల్ల జూనియర్లు, సీనియర్లు రంగారెడ్డి జిల్లాలోనే ఉండిపోయారు. దీనికి తోడు మెడికల్ గ్రౌండ్ కింద మరికొందరు, (స్పౌస్) భార్యాభర్తల జీవోతో మరి కొంతమంది జిల్లాకు వచ్చారు. దీంతో 20 శాతం ఉండాల్సిన స్థానికేతరులు, 50 శాతానికి మించిపోయారు. దీంతో జిల్లాలో సగానికి పైగా స్థానికేతరులైన ఉపాధ్యాయులు ఉన్నట్లు ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి.

**జిల్లాలోని ఉపాధ్యాయ పోస్టుల వివరాలు..**

జిల్లాలో మొత్తం 8,529 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో ఎస్‌జీటీలు 4,054, స్కూల్ అసిస్టెంట్లు 3,397, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు 276, ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 200 మంది ఉన్నారు. వీరిలో సగానికి పైగా మహబూబ్‌నగర్, నల్లగొండ, యాదాద్రిభువనగిరి వంటి జిల్లాల నుంచి వచ్చిన వారే ఉన్నారు. స్థానికులు మాత్రం ఇతర జిల్లాల్లో ఉద్యోగాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**స్థానిక నిరుద్యోగులకు తీరని అన్యాయం..**

317 జీవోను అడ్డం పెట్టుకుని వివిధ క్యాటగిరీల్లో ఉపాధ్యాయులు జిల్లాలోకి వచ్చారు. భార్యాభర్తల బదిలీలు, మెడికల్ గ్రౌండ్ వంటి కోటాల కింద పెద్ద ఎత్తున వస్తున్నారు. రాజకీయ పలుకుబడితో కొంతమంది, ప్రభుత్వ జీవోల ద్వారా మరికొంతమంది జిల్లాలోకి వస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చేవారితో రంగారెడ్డి జిల్లాలోని ఉద్యోగాలన్నీ భర్తీ అవుతున్నాయి. కానీ, జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు మాత్రం తీరని అన్యాయం జరుగుతున్నదని వాపోతున్నారు. ఉన్నత చదువులు అభ్యసించి బీఈడీ, డీఈడీ, పూర్తి చేసి ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ క్వాలిఫై ఎంతోమంది ఉన్నారు. వీరంతా డబ్బులు ఖర్చుపెట్టుకుని డీఎస్సీ కోచింగ్‌లకు వెళ్లి నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. వీరందరికీ ఉద్యోగావకాశాలు రావడానికి అక్రమ వలసలు అడ్డంకిగా మారాయి. జిల్లాలో ఖాళీలు లేకపోవడం వల్ల వికారాబాద్, నల్లగొండ వంటి జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇతర జిల్లాల నుంచి వచ్చే వలసలను నిలిపివేయాలని ఈ ప్రాంత నిరుద్యోగులు కోరుతున్నారు.

**స్థానికేతరులతో జిల్లాకు తీవ్ర అన్యాయం..**



జీవో 317ను అడ్డం పెట్టుకుని వివిధ కారణాల చేత అడ్డదారిలో జిల్లాలోకి ఇతర ప్రాంతాల ఉపాధ్యాయులు రావడంతో జిల్లాలోని నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారు. కొత్తగా ఉద్యోగాలు సంపాదించినవారు జిల్లాలో ఖాళీ లేకపోవడం వల్ల ఇతర జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 4 నుంచి 6వేల మంది ఉపాధ్యాయులు వచ్చారు. స్థానికత ఆధారంగా మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ముందుగా జూనియర్లు వచ్చారని, జూనియర్లను ఎలా పంపిస్తారంటూ సీనియర్లు కోర్టు ద్వారా వచ్చారు. జూనియర్లను తిరిగి పంపించకపోవడం వల్ల ఆ జిల్లాకు చెందినవారే అధికంగా ఉన్నారు. దీంతో జిల్లా వాసులకు తీరని అన్యాయం జరుగుతున్నది.

– సత్తారి రాజిరెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

**పరిగి మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు. రైతులకు దన్నుగా నిలిచి వారు తెచ్చిన వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధర వచ్చేలా చూడాల్సిన మార్కెటింగ్ శాఖ అధికారులు చోద్యం చూస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. అలవికాని హామీలతో అందలమెక్కిన కాంగ్రెస్ సర్కారు రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదు. తద్వారా ప్రతి సీజన్‌లోనూ రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు రాక తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు. తక్కువగా వ్యవసాయ ఉత్పత్తులు వచ్చే సమయంలో అధిక ధరలు పెట్టి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు ఆ మరుసటి వారమే క్వింటాలుకు ఒకటి నుంచి రెండు వేల రూపాయలు తగ్గించడం ద్వారా రైతులను నట్టేట ముంచుతున్నారు. సరిగ్గా ఏడాది క్రితం జనవరి 27వ తేదీన వేరుశనగను విక్రయించేందుకు పరిగి మార్కెట్‌కు తీసుకురాగా వ్యాపారులు కూడబలుక్కొని క్వింటాలుకు వెయ్యి రూపాయలు తగ్గించడంతో జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. మళ్లీ ఏడాది తర్వాత వేరుశనగ రైతులే ధరల కోసం రోడ్డెక్కారు. గత వారానికి ఈ నెల 25వ తేదీకి వేరుశనగ క్వింటాలుకు రెండు వేలు తగ్గించడం రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వేరుశనగ కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.6783 ప్రకటించగా గత శుక్రవారం పరిగి మార్కెట్‌లో రూ.6500 వరకు విక్రయింపబడింది. ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే సుమారు రూ.300 తక్కువకు వ్యాపారులు కొనుగోలు చేసినా రైతులు వేరుశనగ విక్రయించారు. ఈ శనివారం వ్యాపారులు సిండికేట్‌గా మారి వేరుశనగకు తక్కువ కోట్ చేశారు. సుమారు 800 లాట్స్‌కుగాను ఆన్‌లైన్‌లో 50 పైగా లాట్స్‌కు కనీసం ఒక్క టెండర్ కూడా రాకపోగా 150 లాట్స్‌కు తక్కువ ధర వేసినట్లు అధికారులే చెబుతున్నారు. సరాసరిన శనివారం అత్యధిక రైతుల వేరుశనగకు రూ.4500 ధర వేశారని రైతులు ఆందోళనకు దిగారు. మార్కెట్ యార్డు నుంచి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి వరకు ర్యాలీ చేపట్టి రోడ్డుపై బైఠాయించారు. రీ టెండర్లు పిలిచామని, ధర పెరుగుతుందని అధికారులు చెప్పడం తప్ప ఆచరణ జరుగలేదు.**

**– పరిగి, జనవరి 27**



# దోచేస్తుండ్రు..

## పరిగి మార్కెట్‌లో సిండికేట్ దందా.. చోద్యం చూస్తున్న అధికారులు..

### ఏడాదైనా అమలు కానీ డైరెక్టర్ హామీలు.. ధరల తగ్గింపుతో నష్టపోతున్న రైతులు

**ఏడాదైనా అమలుకు నోచుకోని డైరెక్టర్ హామీలు..**

పరిగి మార్కెట్‌లో వ్యాపారుల మోసాలు ఆగడం లేదు. గత సంవత్సరం జనవరిలో వేరుశనగ రైతులు ఆందోళన చేపట్టి తమ సమస్యలు ఏకరువు పెట్టారు. జనవరి 27వ తేదీన వికారాబాద్ ఆర్డీవో రైతుల వద్దకు వచ్చి సమస్యలు విని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆ మరుసటి రోజు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి పరిగి మార్కెట్‌ను సందర్శించారు. మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లయితే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో వేరుశనగ కొనుగోలుకు సైతం చర్యలు తీసుకుంటామన్నారు. కమీషన్ ఏజెంట్‌లు తక్‌పట్టీలు ఇవ్వకపోవడంపై ఆమె స్పందిస్తూ తక్‌పట్టీలు ఇవ్వని అంశంపై వెంటనే పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. పరిగిలో ఒకేరోజు బీట్లు ఉండడం వల్ల ఒకేసారి అధిక మొత్తంలో వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్‌కు వస్తున్నాయని, రెండు రోజులు బీట్లు జరిపేలా ఆలోచిస్తామన్నారు. ఉదయం 10 గంటల లోపు వచ్చిన వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి వెంటనే బీట్లు నిర్వహించి సాయంత్రం లోపు తూకం పూర్తయ్యేలా చూడాలని, మధ్యాహ్నం వచ్చిన వాటిని మరుసటి రోజు బీట్లు వేసేలా చూడాలన్నారు. అవసరమైతే చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తామన్నారు. మార్కెట్ యార్డులో వృథాగా పడివున్న వేయింగ్ మిషన్‌ను మరమ్మతు చేయిస్తామని హామీ ఇచ్చారు. కమీషన్ ఏజెంట్‌లు రూ.2 కంటే ఎక్కువ కమీషన్ తీసుకుంటే వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు కొనుగోలుకు వచ్చేలా చూడాలన్నారు. ఇందులో ఏ ఒక్కటి అమలుకు నోచుకోకపోవడం గమనార్హం. గత శనివారం రైతుల ఆందోళనతో వేరుశనగ బీట్లు ప్రతి మంగళవారం చేపడతామని మార్కెట్ కమిటీ వారు ఆదరాబాదరాగా ప్రకటించారు. ధరల విషయంలో ఎలాంటి హామీ ఇవ్వకపోవడం గమనార్హం.

**నష్టపోతున్న సీఎం నియోజకవర్గ రైతులు...**

పరిగి మార్కెట్‌కు అత్యధికంగా కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల, బొంరాస్‌పేట మండలాల పరిధిలోని రైతులు వేరుశనగ తీసుకొస్తుంటారు. ప్రతి సంవత్సరం పరిగి మండలం కంటే అత్యధికంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి చెందిన రైతులే వేరుశనగ పెద్ద ఎత్తున తీసుకొస్తున్నారు. తక్కువ మోతాదులో వేరుశనగ వచ్చినప్పుడు అధిక ధరకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు పెద్ద ఎత్తున వచ్చినప్పుడు ధరలు తగ్గించి రైతులను దోచుకుంటున్నారు. ఈ విషయమై రైతులు నిలదీసిన సమయంలో వచ్చే వారం నుంచి తగిన చర్యలు ఉంటాయని అధికారులు చెప్పడం తప్ప ఎక్కడా ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈసారి ఆన్‌లైన్‌లో బిడ్డింగ్ వేసి కొనుగోలు చేపడుతున్నా, స్థానిక వ్యాపారులే కూడబలుక్కొని ఆన్‌లైన్‌లో తాము నిర్ణయించిన ధరలు వేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. తక్కువ బస్తాలు గల లాట్‌కు అధిక ధర నిర్ణయించి, మిగతా 95శాతం వేరుశనగకు తక్కువ ధర కోట్ చేస్తున్నారని పేర్కొంటున్నారు. వ్యాపారుల మోసంతో ప్రధానంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ రైతులు అత్యధికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని రైతులకు నష్టం జరగకుండా చూడాలని కోరుతున్నారు.



పంచాయతీల రికార్డులను స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

## మొయినాబాద్ మున్సిపాలిటీ..

# ఏర్పాటు ప్రక్రియ పూర్తి

**ఎనిమిది గ్రామ పంచాయతీల రికార్డులు స్వాధీనం**

**గ్రామ పంచాయతీలను సీజ్ చేసిన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ అధికారులు**

**పంచాయతీ కార్యదర్శులు జీపీలకు రావద్దు**

**గ్రామ పంచాయతీ కార్యాలయాలపై పేర్లను తొలగించాలి**

**బండ్లగూడ జాగీర్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శరత్‌చంద్ర**

మొయినాబాద్, జనవరి 27: హైదరాబాద్ మహా నగరానికి చేరువలో ఉండడంతో మొయినాబాద్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తున్నట్లుగా ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. ప్రకటించిన విధంగానే మున్సిపాలిటీ ప్రక్రియ కూడా అధికారికంగా పూర్తి చేసింది. గ్రామ పంచాయతీల్లో ఉన్న రికార్డులను స్వాధీనం చేసుకోవడం సోమవారం మొదలు పెట్టారు. బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా శరత్‌చంద్ర బాధ్యతలు స్వీకరించిన ఆయన తమ సిబ్బందితో వచ్చి గ్రామ పంచాయతీ రికార్డులు ఉండే బీరువాలను సీజ్ చేశారు. పంచాయతీ అధికారులకు గానీ, గ్రామ కార్యదర్శులకు గానీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆకస్మికంగా గ్రామ పంచాయతీలను సందర్శించి గ్రామ పంచాయతీ రికార్డులో ఏమేమి ఉన్నాయో బీరువాలో పెట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శులు పంచాయతీకి సంబంధించిన పూర్తి రికార్డులను మున్సిపల్ అధికారులకు అప్పగించడంతో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కమిషనర్ స్టాప్ వేసి బిరువాలను సీజ్ చేశారు. మొయినాబాద్ మున్సిపాలిటీలో విలీనమైన మొయినాబాద్, సురంగల్, ముర్తుజాగూడ, చిలుకూరు, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, ఎన్కేపల్లి, ముర్తుజాగూడ గ్రామ పంచాయతీల రికార్డులను స్వాధీనం చేసుకోవడానికి కమిషనర్ తమ సిబ్బందితో సోమవారం సాయంత్రం 5 గంటలకు మొయినాబాద్ గ్రామ పంచాయతీకి వచ్చి పంచాయతీల్లోని బీరువాలతో పాటు రికార్డులు ఉన్న గదులను సీజ్ చేశారు గ్రామ పంచాయతీ కార్యదర్శులు పంచాయతీ కార్యాలయాలకు ఎవరూ రావద్దని, మండల కార్యాలయానికి మాత్రమే వెళ్లాలని ఆదేశించారు. రాత్రి 8 గంటల వరకు మున్సిపాలిటీలో విలీనమైన 8 గ్రామ పంచాయతీలకు వెళ్లి రికార్డులు ఉన్న బీరువాలను, రికార్డులను ఉన్న ఆఫీస్‌లను సీజ్ చేసి వెళ్లారు. ఎప్పుడు వచ్చి రికార్డులు తీసుకెళ్తారో .. ఎక్కడ రికార్డులు భద్రపరుస్తారో అధికారులే ప్రకటించాల్సి ఉన్నది. గ్రామ పంచాయతీ కార్యాలయాల మీద పేర్లను కూడా తొలగించాలని, పేర్ల మీద రంగులు వేయాలని ఆదేశాలు జారీ చేశారు.